క్లుప్తంగా

శనిత్రయోదశి పూజలు

బేతంచెర్ల: శనిత్రయోదశిని పురస్కరించుకుని మండలంలోని పలు ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అంబాపురం గ్రామ సమీపంలోని కొండపై వెలసిన ధర్మగిరి పీఠంలో భక్తులు శనీశ్వరస్వామికి తైలాభిషేకం, కుంకుమార్చన నిర్వహించారు. అలాగే ఆశ్రమంలోని కాశీ అన్నపూర్ణేశ్వరి, దత్తాత్రేయ స్వామి, పంచముఖ ఆంజనేయస్వామి, సీతారాముల, వీరభద్ర స్వామికి పూజలు చేశారు.

పిల్లలను పనిలో పెట్టుకుంటే చర్యలు



వ్యాపారులకు అవగాహన కల్పిస్తున్న అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ శోభారాణి

కొలిమిగుండ్ల: ఫ్యాక్టరీలు, దుకాణాల్లో 18 ఏళ్ల లోపు పిల్లలను పనిలో చేర్చుకుంటే చర్యలు తప్పవని అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ శోభారాణి హెచ్చరించారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు శనివారం కొలిమిగుండ్లలోని పలు దుకాణాలను ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పిల్లలను హోటళ్లు, దుకాణాలు, ఫ్యాక్టరీల్లో పనిలో పెట్టుకుంటే యజమానులపై కేసులు నమోదు చేస్తామని తెలిపారు. బడి ఈడు పిల్లలు అందరూ బడిలో ఉండేందుకు, బాల కార్మిక వ్యవస్థను నిర్మూలించేందుకు స్పెషల్ డ్రైవ్‌ను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. పలువురు వ్యాపారులకు అవగాహన కల్పించారు. ఆమె వెంట సిబ్బంది సునీల్ కుమార్, నాగజ్యోతి, నీలిమ, సంధ్య ఉన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

బనగానపల్లె రూరల్: మండలంలోని ఇల్లూరుకొత్తపేట విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతు పనుల కారణంగా ఆదివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ శాఖ ఏఈ గర్జప్ప శనివారం తెలిపారు. రైతుల కు సరఫరా చేసే ఉచిత విద్యుత్ ఉదయం 3 గంటల నుంచి 9 గంటల వరకు, తిరిగి మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 6 గంటల వరకు సరఫరా ఉంటుందన్నారు. విద్యుత్ వినియోగదారులు, రైతులు సహకరించాలని ఏఈ కోరారు.

పాఠశాలకు ఫర్నిచర్ విరాళం



పూర్వ విద్యార్థులు అందజేసిన ఫర్నిచర్

ప్యాపిలి: మండల పరిధిలోని హుసేనాపురం ఉన్నత పాఠశాలకు పూర్వ విద్యార్థుల సంఘం (హోసా) ఆధ్వర్యంలో రూ.20 వేలు విలువ చేసే ఫర్నిచర్ విరాళంగా ఇచ్చారు. శనివారం పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రెండు టేబుల్‌లు, 3 కుర్చీలు అందజేశారు. హుసేనాపురం సర్పంచ్ విద్యార్థులకు రూ. 5 వేలు విలువచేసే బహుమతులు అందజేశారు. అలాగే 1993–94 బ్యాచ్‌కు చెందిన బావిపల్లి శ్రీనివాసులు విద్యార్థులకు బహుమతులు అందజేసేందుకు రూ. 5 వేలు విరాళంగా ఇచ్చారు. కార్యక్రమంలో హెచ్ఎం అన్వర్ బాషా, ఉపాధ్యాయులు చంద్రమౌళి, అంజనప్ప, మురళి, ఎస్ఎంసీ చైర్మన్ రవి కుమార్, హోసా సభ్యులు నాగభూషణ్ రెడ్డి, రామకృష్ణారెడ్డి, తిమ్మారెడ్డి, గంగాధర్ రెడ్డి పాల్గొన్నారు.

జాతీయ సమితి సమ్మేళనం జయప్రదం చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న సుంకయ్య

డోన్ రూరల్: సెప్టెంబర్ 1, 2, 3వ తేదీలలో విశాఖ నగరంలో నిర్వహించే ఏఐటీయూసీ జాతీయ సమితి సమ్మేళనాలను జయప్రదం చేయాలని ఆ సంఘం నంద్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి సుంకయ్య, వర్కింగ్ ప్రెసిడెంట్ లక్ష్మీనారాయణ కార్మికులకు పిలుపునిచ్చారు. పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో శనివారం నిర్వహించిన ఏఐటీయూసీ నియోజకవర్గ జనరల్‌బాడీ సమావేశంలో వారు మాట్లాడారు. కార్మిక హక్కుల సంరక్షణే లక్ష్యంగా ఏఐటీయూసీ పోరాటాలు చేస్తుందన్నారు. సమావేశంలో ఏఐటీయూసీ నియోజకవర్గ కార్యదర్శి అబ్బాస్, సీపీఐ పట్టణ కార్యదర్శి నారాయణ, మండల సహాయ కార్యదర్శులు వరదరాజులు, హుసేన్, జులేఖ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ షాక్‌తో రెండు ఆవులు మృతి

కోవెలకుంట్ల: పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో శనివారం రాత్రి విద్యుత్ ప్రమాదంలో రెండు ఆవులు మృతి చెందాయి. ఆవులు మేత కోసం సంచరిస్తూ స్థానిక యాక్సిస్ బ్యాంకు సమీపంలో వెళుతుండగా విద్యుత్ వైర్లు ఎర్త్ కావడంతో షార్ట్‌సర్క్యూట్ చోటు చేసుకుని ఆవులు అక్కడికక్కడే మృత్యువాతపడ్డాయి.

నినదించిన వైద్యులు

- కోల్‌కతాలో జూనియర్ వైద్యురాలి హత్యాచారంపై నిరసనలు
- 24 గంటలు వైద్య సేవలు బంద్
- వైద్యులకు రక్షణ కల్పించాలని నినాదాలు



డోన్‌లో ర్యాలీ చేస్తున్న వైద్యులు



ఆర్డీఓ కార్యాలయంలో వినతిపత్రం అందజేస్తున్న వైద్యులు



డోన్: గాంధీ విగ్రహం వద్ద మానవహారంగా ఏర్పడిన వైద్య సిబ్బంది, విద్యార్థులు

డోన్ టౌన్: పశ్చిమ బెంగాల్ రాష్ట్రం కోల్‌కతాలోని ఆర్‌జీకర్ ప్రభుత్వ ఆస్పత్రిలో జూనియర్ వైద్యురాలిపై హత్యాచార ఘటనను నిరసిస్తూ శనివారం డోన్‌లో వైద్యులు, పారామెడికల్ సిబ్బంది నిరసన వ్యక్తం చేశారు. డోన్‌లోని ప్రభుత్వ, ప్రైవేట్ వైద్యులతో పాటు నర్సులు, ల్యాబ్ టెక్నీషియన్స్లు, వైద్య సిబ్బంది, ఆర్ఎంపీలు, మెడికల్ షాపు నిర్వాహకులు, మహిళా సంఘాలు,విద్యార్థులు పెద్ద ఎత్తున ర్యాలీలో పాల్గొన్నారు. ఇండియన్ మెడికల్ అసోసియేషన్ పిలుపు మేరకు 24 గంటల బంద్ పాటించారు. పాత బస్టాండ్‌లోని గాంధీ విగ్రహం వద్ద మానవహారంగా ఏర్పడి నిరసన వ్యక్తం చేశారు. నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని కోరారు.

వైద్యులకు భద్రత కల్పించాలి

ప్రభుత్వాస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ మమ్మద్ హనీఫ్, వైద్యులు సుంకన్న, యశోధ, బాలచంద్రారెడ్డి, మాట్లాడుతూ.. దేశంలో డాక్టర్లపై దాడులు పెరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. మహిళలకు రక్షణ కరువైందని పేర్కొన్నారు. కోల్‌కతాలో జూనియర్ వైద్యురాలిపై దాడికి నిరసనగా ఆగస్టు 14వ తేదీ ఆర్‌జీకర్ కళాశాల విద్యార్థులు నిరసనలు తెలపగా రైడీ మూకలు ఆస్పత్రిపై దాడి చేయడం దారుణం అన్నారు. డ్యూటీలో ఉన్న వైద్యులు, వైద్య సిబ్బందికి తగిన రక్షణ కల్పించాలని కోరారు. ఇందు కోసం ప్రత్యేక చట్టాలు తీసుకురావాల్సిన అవసరం ఉందన్నారు.

అనంతరం ఆర్డీఓ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి వినతిపత్రం అందజేశారు. వైద్యులు ముస్కీంవలి, బాషా, మహ్మద్‌రఫీ, వెంకటేశ్వర్లు, సుబ్బయ్య, రాజేంద్రప్రసాద్, కుసుమకుమారి, లావణ్య పాల్గొన్నారు.

ప్రాణం పోసే వైద్యులకు రక్షణ కల్పించాలి

బేతంచెర్ల: జూనియర్ వైద్యురాలిపై హత్యాచార నిందితులను కఠినంగా శిక్షించాలని శేషారెడ్డి సీహెచ్‌సీ వైద్యుడు వెంకటేశ్వర్లు అన్నారు. స్థానిక పీహెచ్‌సీ నుంచి వైద్య సిబ్బందితో కలిసి పాతబస్టాండ్ వరకు నిరసన ర్యాలీ నిర్వహించారు. అలాగే మండలంలోని ఆర్ఎస్ రంగాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు అలీ మ్, ఆరోగ్య సిబ్బంది నిరసన తెలిపారు. రోగులకు ప్రాణం పోసే వైద్యులకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి

కోవెలకుంట్ల: కోల్‌కతా ఆస్పత్రిలో వైద్యురాలిపై హత్యాచారం చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని కోవెలకుంట్ల కమ్యూనిటీ హెల్త్ సెంటర్ ఇన్‌చార్జ్ డాక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి డిమాండ్ చేశారు. శనివారం ఆస్పత్రిలో ఓపీ సేవలు బంద్ చేసి ఆందోళన చేపట్టారు. డాక్టర్లు, వైద్య సిబ్బంది సీహెచ్‌సీ నుంచి గాంధీసెంటర్, సంతమార్కెట్, స్టేట్‌బ్యాంకు మీదు గా గ్రామ పంచాయతీ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. పంచాయతీ సర్కిల్‌లో మానవహారంగా ఏర్పడి నిరసన వ్యక్తం చేశారు. డాక్టర్లు సోఫి యా, నవీన్‌కుమార్‌రెడ్డి, సృజన, కృష్ణమూర్తి, అశో క్, స్టాఫ్ నర్సు ఇందిరా, ల్యాబ్ టెక్నిషియన్లు రమేష్‌బాబు, శ్రీనివాసులు, రవికుమార్ పాల్గొన్నారు.

వైద్య సేవలు నిలిపివేసి నిరసన

కోవెలకుంట్ల: కోల్‌కతా ఆర్‌జీ కార్ ఆస్పత్రిలో యువ డాక్టర్ హత్యాచార ఘటనకు నిరసనగా రేవనూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యులు, సిబ్బంది శనివారం అత్యవస సేవలు మినహా ఓపీతోపాటు అన్ని రకాల వైద్య సేవలు నిలిపివేసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా డాక్టర్లు విద్యాసాగర్, మహబూబ్ సుభాని మాట్లాడుతూ.. జూనియర్ డాక్టర్‌ను అత్యాచారం చేసి ఆపై హత్య చేసిన దోషులను బహిరంగంగా ఉరితీయాలని డిమాండ్ చేశారు. కేసును ఫాస్ట్‌ట్రాక్ కోర్టులో విచారణ జరపాలని, డాక్టర్ల కోసం ప్రత్యేక చట్టం తీసుకునిరావాలని కోరారు. హెల్త్ సూపర్‌వైజర్లు గిరిజ, ప్రభావతి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

వైద్యులకు భద్రత కల్పించాలి

బనగానపల్లెరూరల్: కోల్‌కతాలో జూనియర్ వైద్యురాలిని హత్యాచారం చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ బనగానపల్లె కమ్యూనిటీ వైద్యశాల, పలుకూరు, టంగుటూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యులు, పారామెడికల్ సిబ్బంది విధులు బహిష్కరించి నిరసన తెలిపారు. స్థానిక ఏరియా వైద్యశాల నుంచి పట్టణంలోని పెట్రోల్ బంకు సర్కిల్ వరకు ర్యాలీగా వెళ్లారు. అనంతరం సర్కిల్‌లో మానవహారంగా ఏర్పడి నిరసన వ్యక్తం చేశారు. డ్యూటీలో ఉండే వైద్యులకు తగిన భద్రత కల్పించాలని, వైద్యుల రక్షణకు ప్రత్యేక చట్టం తీసుకురావాలని డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో నారాయణరెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఏరియా వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ సుజాత, వైద్యులు శివశంకరుడు, సోహెల్ బాబు, నర్సింగ్ సిబ్బంది, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

ఉరితీయాలి

సంజామల: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్ కృష్ణకుమారి ఆధ్వర్యంలో సంజామలలో వైద్యులు, పారా మెడికల్ సిబ్బంది, ఏఎన్ఎంలు, విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. హత్యాచార నిందితులను ఉరి తీయాలని డిమాండ్ చేశారు.

అవుకులో కొవ్వొత్తుల ర్యాలీ

అవుకు: జూనియర్ డాక్టర్‌పై లైంగిక దాడి చేసి హత్య చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని అవుకు, ఉప్పలపాడు పీహెచ్‌సీ డాక్టర్లు రవికుమార్, యమునా, నవీన్ కుమార్ డిమాండ్ చేశారు. హత్యకు గురైన ట్రైనీ డాక్టర్ ఆత్మకు శాంతి కలగాలని వైద్యులు, పారా మెడికల్ సిబ్బంది శనివారం అవుకు బస్టాండ్ వద్ద కొవ్వొత్తులతో ప్రదర్శన చేశారు. ఈ సందర్భంగా డాక్టర్లు మాట్లాడుతూ.. మానవ మృగాల్లా ఒక అమ్మాయిని అతి కిరాతకంగా లైంగిక వేధింపులకు గురి చేయడమేకాకుండా హత్య చేయడం దారుణమని అన్నారు. దీనిపై విచారణను సత్వరం పూర్తి చేసి కారుకులను కఠినంగా శిక్షించాలని కోరారు. ఇలాంటివి పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకోవాలన్నారు.



కొవ్వొత్తులతో నిరసన తెలుపుతున్న వైద్యులు





బేతంచెర్ల, రేవనూరు(కోవెలకుంట్ల) పీహెచ్‌సీ ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న డాక్టర్లు, వైద్య సిబ్బంది



కోవెలకుంట్లలో మానవహారం,



బనగానపల్లెలో నిరసన తెలుపుతున్న వైద్యులు, వైద్య సిబ్బంది



సంజామలలో..

ఆక్రమణకు ‘అధికారం’

- నాడు నిబంధనలకు విరుద్ధంగా రోడ్డుపై ప్రహరీ నిర్మించారని కూల్చివేసిన అధికారులు
- నేడు అధికార అండతో పునర్నిర్మించిన టీడీపీ నాయకుడు
- చోద్యం చూస్తున్న కుడా, పంచాయతీ రాజ్ అధికారులు
- తన దృష్టికి రాలేదన్న ఈఓఆర్డీ జయరాం



నాడు.. ప్రహరీని కూల్చివేయిస్తున్న అధికారులు



నాడు..అధికారులతో వాగ్వాదానికి దిగిన టీడీపీ నేత మురళీకృష్ణ గౌడ్



నేడు..ఆక్రమించి నిర్మించిన ప్రహరీ

డోన్: అతనో తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు. గత టీడీపీ హయాంలో మార్కెట్ యార్డు చైర్మన్‌గా పని చేశాడు. ఎంకే టౌన్‌షిప్ పేరుతో రియల్‌ఎస్టేట్ వ్యాపారం చేస్తూ 60 అడుగుల రోడ్డులో 30 అడుగులు ఆక్రమించాడు. దీంతో 2022 నవంబర్ 15వ తేదీ రోడ్డును ఆక్రమించి నిర్మించిన ప్రహరీని కర్నూలు అర్బన్ డెవలప్‌మెంట్ అధికారులు (కుడా) కూల్చివేశారు. ఎంకే టౌన్‌షిప్ భాగస్వామి అయిన మురళీకృష్ణ గౌడ్‌తో పాటు పలువురు టీడీపీ నాయకులు కుడా, పోలీస్, రెవెన్యూ పంచాయతీ రాజ్ శాఖ అధికారులను అడ్డగించి నానా యాగీ చేశారు. అయినా లెక్క చేయకుండా నిబంధనలకు విరుద్ధంగా రోడ్డుపై నిర్మించిన ప్రహరీని అధికారులు నేలమట్టం చేసి 60 అడుగుల రోడ్డుకు మార్గం సుగమం చేశారు.

అధికారంలోకి వచ్చిన వెంటనే...

రాష్ట్రంలో టీడీపీ అధికారంలోకి వచ్చిన రెండు నెలలకే నాడు కూల్చివేసిన ప్రహరీ స్థానంలో నూతన ప్రహరీని రెండు రోజులుగా రేయింబవళ్లు నిర్మిస్తున్నారు. అధికార పార్టీ అండ చూసుకుని మురళీకృష్ణ గౌడ్ కుడా నిబంధనలను యథేచ్ఛగా ఉల్లంఘిస్తున్నా సంబంధిత అధికారులు నోరు మెదపడానికి సాహసించడం లేదు. కూల్చి వేసిన ప్రహరీ స్థానంలో నూతన గోడను నిర్మిస్తున్నారని పలువురు ఫిర్యాదు చేసినా ఆ వైపు వెళ్లేందుకు కూడా జంకుతున్నారు. దీంతో ఎంకే టౌన్‌షిప్‌లో లక్షలాది రూపాయలు ఖర్చు పెట్టి ప్లాట్లు కొనడమే కాక ఇళ్లు నిర్మించుకున్న పలువురు యజమానులు అధికారుల ఉదాసీన వైఖరిని తప్పుపడుతున్నారు. 60 అడుగుల రోడ్డు ఉందని వెంచర్ పాంప్లేట్, గ్రామ పంచాయతీ అప్రూవల్ చూసి తాము ఎంకే టౌన్‌షిప్‌లో స్థిరనివాసం ఏర్పరుచుకున్నామని అయితే ప్రధానంగా ఉన్న 60 అడుగుల రోడ్డును 30 అడుగుల రోడ్డుకు కుదించి యజమానులు మిగిలిన స్థలంలో ప్లాట్లు వేసి లక్షలాది రూపాయలు అక్రమంగా అర్జించారని వాపోతున్నారు.

అబ్బే..మాకేం తెలీదు

గతంలో నిబంధనలకు విరుద్ధంగా కూల్చివేసిన ప్రహరీని తిరిగి నిర్మించేందుకు అనుమతులు ఇచ్చారా అని ఈఓఆర్డీ జయరాంను ప్రశ్నించగా అబ్బే..మాకేం తెలియదంటూ దాటవేశారు. నిబంధనలకు విరుద్ధంగా ప్రవర్తిస్తే ఏనాడైనా కూల్చేస్తారని రొటీన్ డైలాగ్‌లు చెప్పారు. పంచాయతీ కార్యదర్శి రవిచంద్ర నాలుగు రోజులుగా సెలవులో ఉన్నందువల్ల తనకు ఏమీ తెలియదన్నారు. సెలవులు అయిపోగానే సంబంధిత వ్యక్తులకు నోటీసులు ఇస్తామని తెలిపారు.

ఎస్సార్‌బీసీ స్థలంలో ఆక్రమణల తొలగింపు





అక్రమంగా నిర్మించిన బేస్‌మెంట్‌ను తొలగిస్తున్న జేసీబీ, తహసీల్దార్‌తో వాగ్వాదానికి దిగిన మహిళ

బనగానపల్లె రూరల్: పట్టణంలోని యాగంటిపల్లె రహదారిలో ఎస్సార్‌బీసీ కాలువ వెంట ఉన్న ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించి చేపడుతున్న నిర్మాణాలను రెవెన్యూ అధికారులు శనివారం కూల్చివేశారు. దీంతో కొద్దిసేపు అక్కడ ఉద్రిక్త వాతావరణం నెలకొంది. తహసీల్దార్ నారాయణరెడ్డి, బనగానపల్లె సీఐ కృష్ణయ్య, సర్వేయర్లు, పోలీసు బందోబస్తుతో పెండేకంటి నగర్‌లోని బిందెల ఫ్యాక్టరీ సమీపంలోని ఎస్సార్‌బీసీ ప్రాంతానికి జేసీబీతో చేరుకున్నారు. ఎలాంటి అనుమతి లేకుండా నిర్మించిన బేస్‌మెంట్ తొలగింపు పనులు ప్రారంభించారు. విషయం తెలుసుకున్న ఆక్రమణదారులు అధికారుల వద్ద వాదనకు దిగారు. తమకు ఇళ్లు లేకపోవడంతోనే ప్రభుత్వ స్థలంలో బేస్‌మెట్ వేసుకుంటున్నామని, ముందుస్తు సమాచారం ఇవ్వకుండా బేస్‌మెట్‌లను ఎలా తొలగిస్తారని తహసీల్దార్ నారాయణరెడ్డితో వాగ్వాదానికి దిగారు. దీనిపై స్పందించిన తహసీల్దార్ ప్రభుత్వ స్థలం ఆక్రమిస్తే ఎలాంటి నోటీసు ఇవ్వాల్సిన అవసరం లేదని, ఇప్పటికే ఇళ్లు నిర్మించుకున్న వారికి, గ్రామ పంచాయతీ ద్వారా త్వరలో నోటీసులు జారీ చేసి తదుపరి చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం పేదల ఇళ్ల పంపిణీ కార్యక్రమం కోసం ప్రభుత్వ స్థలాలను గుర్తించాలని ఆదేశాలు ఇచ్చిందని, ఇందులో భాగంగా ఎస్సార్‌బీసీ స్థలాలను గుర్తించి ఇక్కడ అక్రమంగా నిర్మాణాలు తొలగించే కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు.

డోన్‌లో చోరీ



చోరీ జరిగిన దుకాణం

డోన్ టౌన్: పట్టణంలోని వినాయకుని గుడి వీధి(కొత్తపేట)లో శనివారం తెల్లవారు జామున చోరీ జరిగింది. వివరాలు.. దివ్యాంగుడైన పట్టణానికి చెందిన నరసింహయ్య వినాయకుని గుడి వీధిలో వంట నూనెల వ్యాపారం చేస్తున్నాడు. శుక్రవారం రాత్రి వ్యాపారం ముగించుకొని దుకాణానికి తాళం వేసి వెళ్లాడు. దొంగ శనివారం తెల్లవారు జామున 3.30 గంటల సమయంలో ముఖానికి చేతిరుమాలు, చేతులకు గ్లౌజులు ధరించి దుకాణానికి ఉన్న తలుపు గడియ పగులగొట్టి లోపలికి వెళ్లి టేబుల్లో ఉన్న నగదును అపహరించాడు. ఈ దృశ్యాలు సీసీ కెమెరాల్లో రికార్డు అయ్యాయి. ఉదయం దుకాణానికి వెళ్లిన నరసింహయ్య చోరీ విషయాన్ని తెలుసుకుని పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. వ్యాపారానికి సంబంధించిన లావాదేవాలు ఉన్న చీటీలతో ఉన్న బ్యాగు, రూ.1.30 లక్షల నగదు అపహరించారని ఫిర్యాదులో పేర్కొన్నారు.

పామాయిల్ సాగుతో మంచి లాభాలు



రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

ప్యాపిలి: పామాయిల్ సాగు లాభదాయకమని.. రైతులు ముందుకు రావాలని డోన్ ఉద్యానశాఖ అధికారిణి కళ్యాణి అన్నారు. మండల పరిధిలోని మెట్టుపల్లి గ్రామంలో శనివారం ఆయిల్ పామ్ మెగా డ్రైవ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా రైతులకు పామాయిల్ సాగుపై అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ.. పామాయిల్ సాగు రైతులకు లాభసాటిగా ఉంటుందన్నారు. రైతులకు ఒక హెక్టార్‌కు రూ. 29 వేల వరకు రాయితీ సౌకర్యం ఉందన్నారు. ఉద్యాన అంతర పంటలు సాగు చేసే రైతులకు హెక్టార్‌కు రూ. 5,500 రాయితీ వర్తిస్తుందని తెలిపారు. రైతు సేవా కేంద్రం అసిస్టెంట్ హుసేన్‌బాషా, నవభారత్ కంపెనీ జిల్లా అధికారి ఫిరోజ్, ఏరియా మేనేజర్ హరి, పవన్ తదితరులు పాల్గొన్నారు.

మద్యం విక్రేత అరెస్ట్

బేతంచెర్ల: మండల పరిధిలోని ఆర్ కొత్తపల్లె గ్రామంలో ఉన్న పీర్లచావిడి వద్ద శనివారం అక్రమంగా మద్యం విక్రయిస్తున్న కుమ్మరి బాలరాజును అదుపులోకి తీసుకున్నట్లు ఏఎస్ఐ లింగమయ్య తెలిపారు. నిందితుడి నుంచి 14 బాటిళ్ల మద్యం, 10 లీటర్ల నాటు సారా స్వాధీనం చేసుకున్నామన్నారు.

పాఠశాలకు సౌండ్ సిస్టమ్ విరాళం

బేతంచెర్ల: పట్టణంలోని ధరణి టౌన్‌షిప్‌లోని మెయిన్ జెడ్పీ హైస్కూల్‌కు దాత వెంకటేశ్వర్ రెడ్డి సహకారంతో రోటరీ క్లబ్ సభ్యులు రూ. 23 వేలు విలువ చేసే సౌండ్ సిస్టంను విరాళంగా అందజేశారు. క్లబ్ మండల అధ్యక్ష, కార్యదర్శులు వీరారెడ్డి, ప్రశాంత్ రెడ్డి, సభ్యులు గణేష్ రెడ్డి, జశ్వంత్ రెడ్డి పాల్గొన్నారు.

విద్యుత్ షాక్‌తో విద్యార్థికి గాయాలు

డోన్ రూరల్: విద్యుత్ షాక్ గురై విద్యార్థి గాయపడిన ఘటన మండల పరిధిలోని గుమ్మకొండ గ్రామంలో శనివారం చోటుచేసుకుంది. గ్రామంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి విద్యార్థి పవన్‌కుమార్ విరామ సమయంలో పాఠశాల వద్దనున్న విద్యుత్ వైర్ల వద్ద వినుప కడ్డీతో ఆడుకుంటుండగా వైర్లకు తాకింది. విద్యుత్ షాక్‌తో విద్యార్థి చేతులు, కడుపు భాగాల్లో గాయాలయ్యాయి. స్థానిక డాక్టర్ వద్ద వైద్యం చేయించి ఇంటికి తీసుకెళ్లారు.

దద్దణాల ప్రాజెక్టును నింపాలి

బనగానపల్లె రూరల్: మండలంలోని మేజర్ ఇరిగేషన్ ప్రాజెక్టు దద్దణాల ప్రాజెక్టును ఎత్తిపోతల పథకం ద్వారా నీటితో నింపాలని ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సోమన్న డిమాండ్ చేశారు. శనివారం యాగంటిపల్లె రహదారిలో ఉన్న ఎత్తిపోతల పథకం వద్ద ఏపీ రైతు సంఘం నాయకులు నిరసన వ్యక్తం చేశారు. ఇరిగేషన్ అధికారులు ఎత్తిపోతల పథకం నిర్వహణ పట్టించుకోకపోవడంతో ఈ పథకం నిరుపయోగంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. సీపీఐ నాయకులు సుబ్బారెడ్డి, సంజీవులు తదితరులు పాల్గొన్నారు.

వంతెన.. ఇంతేనా..?



శిథిలమైన వంతెనపై రాకపోకలు సాగిస్తున్న వాహనాలు

- ప్రమాదకరంగా మారిన కుందర వాగు వంతెన

కోవెలకుంట్ల: మండలంలోని భీమునిపాడు సమీపంలో కోవెలకుంట్ల–ఆళ్లగడ్డ ఆర్అండ్‌బీ రహదారిలో కుందర వాగుపై ఏర్పాటు చేసిన వంతెన ప్రమాదకరంగా మారింది. బ్రిటీష్ కాలంలో 1932లో వాగుపై వంతెన నిర్మించారు. 92 ఏళ్లు కావడంతో ప్రస్తుతం పూర్తిగా శిథిలావస్థకు చేరుకుంది. వంతెనకు ఇరువైపులా ఏర్పాటు చేసిన కడ్డీలు వంగిపోవడంతో పాటు దిమ్మెలు పూర్తిగా దెబ్బతిని వంతెన కూలేందుకు సిద్ధంగా ఉంది. వంతెనకు సైడ్‌వాల్స్ లేకపోవడంతో గతంలో వాహనాలు వాగులో పడి ప్రయాణికులు ప్రాణాలు కోల్పోయిన సంఘటనలు ఉన్నాయి. ఈ రహదారిలో నిత్యం వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయి. రాత్రి వేళల్లో వంతెనపై ప్రయాణ సమయంలో ఏమాత్రం ఏమరపాటు వహించినా వాహనాలు వాగులోపడి ప్రాణాలు కోల్పోవాల్సిందే. ఆర్అండ్‌బీ అధికారులు దెబ్బతిన్న వంతెన స్థానంతో కొత్త వంతెన ఏర్పాటు చేసి ప్రమాదాలు అరికట్టాలని ప్రజలు కోరుతున్నారు.

యాలూరి స్వామిరెడ్డి వర్ధంతి



స్వామిరెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి జోహార్లు అర్పిస్తున్న సీపీఐ నాయకులు

బనగానపల్లె రూరల్ : స్థానిక ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని సీపీఐ కార్యాలయంలో శనివారం స్వాతంత్ర్య సమర యోధుడు, కమ్యూనిస్టు నేత యాలూరి స్వామిరెడ్డి వర్ధంతిని నిర్వహించారు. ఆయన చిత్ర పటానికి నాయకులు, కార్యకర్తలు పూలమాలలు వేసి జోహార్లు అర్పించారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి శివబాలకృష్ణ పడిద్యాల మండలం బీరవోలు గ్రామానికి చెందిన యాలూరి స్వామిరెడ్డి పేదల పక్షాన ఎనలేని పోరాటాలు సాగించారని గుర్తు చేశారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి సుబ్బారెడ్డి, ఏపీ ప్రజానాట్య మండలి జిల్లా కార్యదర్శి శివయ్య, నాయకులు శివనాగయ్య, మద్దిలేటి, సుబ్బయ్య, గంగన్న తదితరులు పాల్గొన్నారు.